వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ గౌతమి

బాలల అభివృద్ధికి పాటుపడదాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

బాలల సర్వతోముకాభివద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. బుధవారం నాడు అంతర్జాతీయ బాలల దినోత్సవం, జాతీయ దత్తత మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని వజ్రకరూరు మండల కేంద్రంలోని శ్రీ జనార్ధన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు, దత్తతకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు కూడా విస్తత స్థాయిలో అవగాహన కల్పించేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కూడా ఈ విషయమై మాట్లాడాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే బైండోవర్ చేసి, కేసులను నమోదు చేయాలన్నారు. 18 ఏళ్ల వయసు వరకు ఉన్న బాలికలు పాఠశాలల్లో చదువుకునేలా చూడాలన్నారు. శిశు గహంలో చిన్నారులు ఉన్నారని, ఎవరైనా తల్లిదండ్రులు చిన్నారులను దత్తత తీసుకోవాలి అనుకుంటే ముందుకు రావాలని సూచించారు. అంతకుముందు వజ్రకరూరులోని కేపీ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పిల్లలకు ఆటల పోటీలు, అవగాహన కార్యక్రమం, బాలల హక్కులు, బాల్యవివాహాల వల్ల జరిగే అనార్థాలు అనే అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, బాలల పరిరక్షణ సమితి అధికారి ఇన్‌చార్జి డిసిపిఒ వెంకటేశ్వరి, శిశు గహ మేనేజర్ దీప్తి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డీఈవో నాగరాజ్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, గవర్నమెంట్ స్కూల్ టీచర్ కష్ణానాయక్, జిల్లా బాలల పరిరక్షణ సమితి వసంత, రమాదేవి, సూపర్‌వైజర్ పద్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రబీలోనూ బీడే..!

- 2.18 లక్షల ఎకరాల్లో పడని విత్తనం
- కొనసాగిన వర్షాభావం
- అనంతలో 28 శాతమే సాగు
- సత్యసాయిలో తొమ్మిది శాతమే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రబీలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణ సాగులో 28 శాతం కూడా రబీలోనూ సాగవలేదు. ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలు బీడుంటే, రబీలో 2.18 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. నైరుతి రుతుపవనాల తరహాలోనే ఈశాన్య రుతుపవనాల కాలంలో వర్షపాతం జిల్లాలో నమోదవ లేదు. దీంతో సాగు విస్తీర్ణం పడిపోయింది.

అనంతలో 28 శాతమే సాగు

అనంతపురం జిల్లాలో రబీ సాధారణ సాగు 3.04 లక్షల ఎకరాలు. ఇందులో 85750 ఎకరాల్లో సాగైంది. సాధారణ సాగులో 28 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో రబీ సాధారణ సాగు 72,097 ఎకరాలకుగానూ 12,599 ఎకరాల్లోనే విత్తనం పడింది. అంటే సాధారణ సాగులో తొమ్మిది శాతమే సాగైంది. ఇందులో రబీలో ప్రధాన పంట పప్పుశనగ. అనంతపురం జిల్లాలో ఈ పంట సాధారణసాగు 1.93 లక్షల ఎకరాలయితే 67,793 ఎకరాల్లోనే పప్పుశనగ పంట సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో ఆరు వేల ఎకరాలకుగానూ 1749 ఎకరాల్లో సాగైంది. వరి అనంతపురం జిల్లాలో 20 వేల ఎకరాల వరకు సాధారణంగా రబీలో సాగవుతుంది. కాని ఈసారి 1003 ఎకరాల్లో సాగైంది. మరో ప్రధాన పంట వేరుశనగ అనంతపురం జిల్లాలో 50 వేల ఎకరాలు. అయితే సాగైంది 3748 ఎకరాల్లో అయింది. సత్యసాయి జిల్లాలో 43,767 ఎకరాలకుగానూ 896 ఎకరాల్లోనే సాగైంది. ప్రధాన పంటల సాగు అన్నీ కూడా సాధారణ సాగు కంటే చాలా తక్కువగా అవడం గమనార్హం.

కొనసాగుతున్న వర్షాభావం

రబీలోనూ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో ఇప్పటికే కరువు మండలాల ప్రకటన జరిగింది. రబీలోనూ ఇదే వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే 438.7 మిల్లీమీటర్లు అయితే నమోదయిన వర్షపాతం 285.7 మిల్లీమీటర్లు. సాధారణం కంటే 34.9 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో 501.2 మిల్లీమీటర్లకు గానూ 344.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ 31.3 శాతం వర్షపాతం లోటుంది. అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే 23 మండలాల్లో వర్షాభావం నెలకొంది. అందులో శెట్టూరు మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 411.8 మిల్లీమీటర్లకుగానూ 146 మిల్లీమీటర్లు నమోదయింది. 64.5 శాతం లోటుంది. సత్యసాయి జిల్లాలో 25 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రొద్దంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 514 మిల్లీమీటర్లకుగానూ 197.7మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 61.6 శాతం లోటుంది. ఇలా ఖరీఫ్ లాగానే రబీ ఆశలు కూడా రైతుల్లో ఆవిరవుతున్నాయి.

సహకార సేవల బలోపేతం దిశగా డిసిఎంఎస్

ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి

వారోత్సవాల్లో పాల్గొన్న డిసిఎంఎస్ ఛైర్మన్, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

సహకార సేవలు బలోపేతం దిశగా డిసిఎంఎస్ ముందుకు సాగుతోందని ఆ సంస్థ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అధితిగాగా జిల్లా సహకార అధికారి ఎం.ప్రభాకర్ రెడ్డి, శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ బి.శ్రీనివాసులు, సబ్ డివిజనల్ సహకార అధికారి జికె.బాలగంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానుగునంగా డిసిఎంస్ తన సేవలను విస్తృతపరుస్తోందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సహకార వారోత్సవాల వేదికను సంఘం అభివద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు సేకరించడానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అభివద్ధికి పాలకవర్గం సజనాత్మక నిర్ణయాలు తీసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. సహకార మార్కెటింగ్ సంఘాల ముఖ్య విధులు, మార్కెటింగ్ సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు వాటి నివారణ చర్యల గురించి బాలగంగాధర్ తెలియజేశారు. ఈ సమావేశంలో బిజినెస్ మేనేజర్ విజయ భాస్కర్, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ ఎం.సత్యనారాయణ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలను ప్రారంభిస్తున్న నదీం అహ్మద్

గ్రంథాలయంలో పోటీ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండవ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులకు పోటీ పరీక్షలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎమ్.మోహన్ రెడ్డి చొరవతో షైన్ ఇండియా మ్యాగజైన్ వారితో 350 మంది విద్యార్థులకుపైగా పోటీ పరీక్షలు నిర్వహించారు. వ్యాస రచన పోటీలు, వక్తృ లేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల ప్రతిభను గుర్తించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షలకు షైన్ ఇండియా మ్యాగజైన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, జిల్లా వయోజన విద్యాధికారి ఆంజనేయులు, డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది, పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

వివిధ సమస్యలపై స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. వజ్రకరూరు మండల కేంద్రంలోని శ్రీ జనార్ధన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గుంతకల్లు ఆర్డీవో వి.శ్రీనివాసులు రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 78 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలన్నారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ లేకుండా నాణ్యతగా సకాలంలో పరిష్కరించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకి సంబంధించి జిల్లాలో ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 26వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హెల్త్, ఎస్డీజీ పారామీటర్స్, ఎల్పీజీ సర్వీసులు, రేషన్, తాగునీరు, హౌసింగ్, గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, కిసాన్ క్రెడిట్ కార్డ్, ఎన్ఆర్ఈజీఎస్, ఇన్సూరెన్స్ పథకాలు, జల్ జీవన్ మిషన్, తదితర అన్ని రకాల కార్యక్రమాలు, పథకాలపై విస్తతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డిఎస్ఒ శోభారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, డిడొ ప్రభాకర్ రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

జగన్‌తోనే ప్రజాసంక్షేమం సాధ్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం సాధ్యం అవుతుందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని రామచంద్రనగర్, బిందెలకాలనీ, రాజీవ్ కాలనీల్లో బుధవారం నాడు నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజా సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగింటికే సంక్షేమ పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రూరల్ కన్వీనర్ హుస్సేన్, సర్పంచి ఆషాబీ, కార్పొరేటర్లు నాగమణి, సుమతి, ఎంపిటిసి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్న ఆరోగ్య సురక్ష సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

ప్రజాపాలనను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఆలూరు సాంబశివారెడ్డి

రాష్ట్రానికి మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. బుక్కరాయ సముద్రం మండలం వెంకటాపురం, దయ్యాలకుంట పల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వారితో అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదల అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్న సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జడ్పిటిసి భాస్కర్, గువ్వల రాజశేఖర్ రెడ్డి, గువ్వల పెద్ద వెంకటరెడ్డి, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, దయాలకుంటపల్లి ఎంపీటీసీ వెంకట శివారెడ్డి, నారాయణరెడ్డి, వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వరికోటి కాటమయ్య పూల నారాయణస్వామి కాలవ నారాయణస్వామి పాల్గొన్నారు.

జోరుగా నకిలీ పురుగు మందుల అమ్మకాలు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గుంతకల్లు పట్టణంలో యజమానులు జోరుగా నకిలీ పురుగు మందులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు ఏటేటా పెట్టుబడులు పెరిగిపోవడం, కొత్త కొత్త తెగుళ్లు సోకి పంట చేతకందకమునుపే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మరోవైపు విపరీతమైన కరువు వీటన్నింటినీ ఎదుర్కొంటూ నానాటికీ వ్యవసాయం భారమవుతోంది. ఈ ఏడాది మార్కెట్‌లో మిరపకు గిరాకీ పెరిగిపోవడంతో గుంతకల్లు ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా 5001 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. అయితే మిరప పంటకు ఈసారి తామర నల్లి, తెల్ల దోమ, కుళ్ల తెగులు సోకడంతో పంటలు దెబ్బతింటున్నాయి. బిఎఎస్ఎఫ్ కంపెనీ తెల్ల దోమ, తామర నల్లి పురుగును నివారించడంలో అద్భుతంగా పని చేస్తుందని ప్రచారం చేయడంతో రైతులు వారి కంపెనీ మందులను ఎగుబడి కొంటున్నారు. ఈ కంపెనీ మందుల సేల్స్ అధికంగా ఉండడంతో ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు నకిలీ మందులను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ మందులను నియంత్రించాల్సిన అధికారులు షాపులను తూతూ మంత్రంగా పరిశీలించి హెచ్చరికలు చేస్తున్నారే తప్ప వారిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ రోజు తనిఖీలకు వెళ్తారో షాపుల నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇస్తున్నారని, దీంతో అక్రమార్కులు నకిలీ మందులను గోదాముల్లో భద్రపరుస్తున్నారని, తద్వారా అధికారులు నకిలీ మందులు పట్టుకోలేకపోతున్నారని రైతులు వాపోతున్నారు. పాత కొత్తచెరువు గ్రామానికి చెందిన సర్పంచి మజ్జిగ మల్లికార్జున తన మిత్రుని చేత ఇదే మందు తెప్పించుకొని మిరప పంటకు పిచికారి చేశారు. 3 రోజులు గడిచినా ఏమాత్రం ఫలితం లేకపోవడం తో వ్యవసాయ అధికారిణికి ఫిర్యాదు చేశారు. జిల్లా స్థాయి అధికారులు మూకుమ్మడిగా అన్ని గోదాముల్లో దాడులు నిర్వహిస్తే నకిలీ మందులను పట్టుకునే అవకాశం ఉంది. అలాగే నకిలీ మందుల పట్ల రైతులకు అవగా హన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా జిల్లా యంత్రాంగం స్పందించి అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో విక్రయిస్తున్న నకిలీ మందులు

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.గౌతమి

కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేటాయించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు అనంతపురం నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి హౌసింగ్‌పై ఆర్డీవోలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, లేఅవుట్ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా 31,336 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 7,511 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు గురువారం రోజు మండలాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమినిటి సెక్రటరీలు, హౌసింగ్ అధికారులు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసుకుని బేసిమట్టం స్థాయిలో ఉన్న లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. బేసిమట్టం స్థాయిలో ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుల ఇంటింటికీ తప్పనిసరిగా వెళ్లాలన్నారు. ఆయా మండలాల పరిధిలో వచ్చే సోమవారంలోగా కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నవంబర్ నెలాఖరు నాటికి ఆర్ఎల్, ఆర్‌సి స్థాయిలో 7,070 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం కేటాయించగా, ఇప్పటివరకు 2,158 ఇళ్ల నిర్మాణాలను పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 4,913 నిర్మాణాలను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, హౌసింగ్ డిఈ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, పబ్లిక్ హెల్త్ ఈఈ సతీష్ రెడ్డి, పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఉరవకొండ

జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లైస్ డిఎం రవీంద్ర సూచించారు. విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిఎం మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ జొన్న ధర రూ. 3,220 నిర్ణయించి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, మీ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో పౌర సరఫరాల శాఖ సహకారంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో జొన్న సాగు చేసిన వివరాలు సేకరించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ పెన్నయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వన్నప్ప, ఎంపిఇఒ లక్ష్మన్న, విఆర్ఒ, తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లైస్ డిఎం రవీంద్ర

డాక్టర్ ఎన్.ఓబిరెడ్డికి అంతర్జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అవార్డు అందుకున్న డాక్టర్ నల్ల ఓబిరెడ్డి

ఎకెఎస్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో 110 దేశాల భాగస్వామ్యంలో ఏటా న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీ న్యూఢిల్లీలో గ్లోబల్ టీచర్ అవార్డులు ప్రదానం చేశారు. అందులో అనంతపురం నగరంలోని శ్రీసాయిబాబా జాతీయ డిగ్రీ కళాశాల(ఎస్ఎస్‌బిఎన్) అధ్యాపకులు డాక్టర్ నల్ల ఓబిరెడ్డి గ్లోబల్ టీచర్ అవార్డు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ ప్రభాకర్‌రాజు, కరస్పాండెంట్ పిఎల్ఎన్.రెడ్డి మాట్లాడుతూ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్.ఓబిరెడ్డికి అవార్డు రావడం హర్షణీయమన్నారు. ఓబిరెడ్డిని కళాశాల ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి, కార్యదర్శి డాక్టర్ కె.నిర్మలమ్మ, వైస్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు, జిసి మెంబర్స్ గోపి, ఎర్రిస్వామి, రవీంద్ర, అధ్యాపకులు డాక్టర్ రసూల్, ఫిరోజ్, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రాప్తాడు స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాప్తాడు జడ్పి హైస్కూల్ లో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రమేష్‌ను సస్పెండ్ చేస్తూ డిఇఒ వి.నాగరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ 20 ఏళ్లుగా చిట్ ఫండ్ కంపెనీ నడుపుతూ ప్రజల నుంచి పెద్దఎత్తున సొమ్ము వసూలు చేశాడు. ఏడాదిగా చిట్టీల సొమ్ము ఎవరికీ ఇవ్వకుండా స్థిర, చరాస్తుల రూపంలో రూ. 3 కోట్లు దాచుకొన్నాడు. దీంతో బాధితులు మాచర్ల రాజు, రామకృష్ణారెడ్డి, నరసింహులు, గంగిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో డిఇఒ అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

హామీలు నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌దే

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పెరవలిలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

ఆలూరులో నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సిఎం జగన్ అని ఎమ్మెల్యే పద్మావతి కొనియాడారు. మండల పరిధిలోని పెరవలి గ్రామ సచివాలయం దగ్గర ఏర్పాటు చేసిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వైసిపి నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాలుగున్నరేళ్లలో పేదలకు అందించిన లబ్ధి వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో ఎంతో మార్పు తెచ్చాయన్నారు. గత టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. సచివాలయ పరిధిలో ఈ నాలుగున్నరేళ్లలో పేదలకు డిబిటి, నాన్ డిబిటి ద్వారా రూ. 11.51 కోట్లు అందాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేద ప్రజల జీవితాలు బాగుపడాలన్నా మళ్లీ జగనే సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, ఎన్వీ నారాయణ, మార్కెట్ డైరెక్టర్ వెంకటనారాయణ, వీరాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. తొలుత ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. అనంతరం ఆలూరు గ్రామ సచివాలయ పరిధిలోని ఆలూరు, వెలమకూరు, బోడయ్యపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట ఎంపిడిఒ, ఎంపిపి సరస్వతి, వైసిపి నాయకులు ఆలూరు రామచంద్రారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

తాడిపత్రి గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని వెలిగించే సాధనం పుస్తకమని గ్రంథాలయ అధికారి బి.రవి కుమార్ నాయుడు పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రవికుమార్ పుస్తకం విలువ, పుస్తకం ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలిపారు. పుస్తకం ఒక మంచి నేస్తమని, చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. చరిత్రను భావితరాలకు అందించే అద్భుతమైన రూపమే పుస్తకం అన్నారు. పుస్తక ప్రదర్శనలో స్వాతంత్ర్య సమరయోధులు, విజ్ఞానం, వినోదం, కథలు, కవితలు, ఆధ్యాత్మిక పుస్తకాలు ఉంచారు. కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రాయదుర్గం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజూ రాయదుర్గం, గుమ్మఘట్ట గ్రంథాలయా ల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాయదుర్గంలో రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల, గుమ్మఘట్ట జడ్పి హైస్కూల్‌లో విద్యార్థులు పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శివ గంగమ్మ, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువ సమయం గ్రంథాలయంలో గడిపి విజ్ఞానాన్ని ఆర్జించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రంథాలయాల అధికారులు ప్రతాపరెడ్డి, నాగరాజు, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నార్పల : పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని నార్పల గ్రంథాలయ శాఖ అధికారిణి జీవన పేర్కొన్నారు. నార్పల గ్రంథాలయంలో రెండో రోజూ పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ కండక్టర్ కెఎల్ఎన్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర, విజ్ఞానం, వినోదం, ఆధ్యాత్మిక, కవితలు, కథల పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.ప్రతాపరెడ్డి, యోగా మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : పుస్తకాలు చదవడం వల్ల మంచి స్నేహం లభించినట్లు గార్లదిన్నె గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెచ్ఎం తిలోత్తమ మాట్లాడుతూ పుస్తకం ఒక మంచి నేస్తమని చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారిణి శిరీష మాట్లాడుతూ గ్రంథాలయం విజ్ఞాన భాండాగారం అని, గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకా లు, పత్రికలు వుంటాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రప్ప, శారద, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల దరిచేర్చడమే లక్ష్యం

కుందుర్పిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ లక్ష్మీనరసింహ

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దరి చేర్చడమే లక్ష్యమని సర్పంచి మసాలా జగన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మహంతపురం గ్రామంలో బుధవారం 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేసిన ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమన్నారు. ఎంపిడిఒ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కన్వీనర్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 5వ వార్డులో బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న నవరత్నాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కౌన్సిలర్లు గోవిందరాజులు, గోవింద, షబ్బీర్, ఫకృద్దీన్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, నాయకులు మహేష్, గంగాధర్, బషీర్, షబ్బీర్, ఫకృద్దీన్, నిజాం, రవి, పవన్, జానకిరామ్, సత్తి, వంశీ, ఆనంద్, బుజ్జి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు నివాళి

బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిటిడబ్ల్యుఒ అన్నాదొర, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న ప్రభుత్వ బాలికల గురుకుల వసతి గృహంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అన్నా దొర అధ్యక్షత వహించారు. జిల్లాలోని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు హాజరై భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌నాయక్, ఫుడ్ కమిటి సభ్యులు గుజ్జల లక్ష్మన్న, ఉమా మహేశ్వరి, మార్కెట్ యార్డ్ కమిటి సభ్యులు రాజు నాయక్, సాకే వీర, పోలా సవీర, ముత్యాలమ్మ, పోలా మహేష్, బంజారా సంఘం నాయకులు శ్రీరాములు నాయక్, మానిటరింగ్ కమిటి సభ్యులు సాకే చిరంజీవి, రామాంజినేయులు, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిర్సా ముండా తమ జాతి ప్రజల కోసం 19వ శతాబ్దంలోనే అప్పటి ఆంగ్లేయుల దురాగతాలను ఎదుర్కొన్నారని తెలిపారు. తమ జాతి ప్రజల పక్షాన ధైర్య సాహసాలతో పోరాడిన వీరుడన్నారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో గిరిజనుల కోసం అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన గొప్ప నాయకుడని కొనియాడారు.

యువత స్వాతంత్ర్య కాంక్షను స్ఫూర్తిగా తీసుకోవాలి

అనంతపురం : యువత స్వాతంత్ర్య కాంక్షను స్ఫూర్తిగా తీసుకోవాలని ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాతి భరత్ సూచించారు. గిరిజన ప్రాంతంలో జన్మించి స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసి ప్రపంచానికి తెలియని గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండ జయంతి పురస్కరించుకొని నెహ్రూ యువ కేంద్రం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను నిర్వహించి మొక్కలు నాటారు. బిసాతి భరత్ మాట్లాడుతూ బిర్సాముండ జయంతి పురస్కరించుకుని జన్ జాతీయ గౌరవ దినోత్సవంగా నిర్వహించటం గొప్ప విషయమన్నారు. యువత దేశం పట్ల గౌరవం, భక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయమారుతి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి వై.పవన్, ఎంట్రిప్రెన్యూరార్ రాఘవేంద్ర యాదవ్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు శేషాద్రి, నందిత, వైష్ణవి, భరత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధిక

ప్రజాశక్తి-నార్పల

పశువులకు మేత కత్తిరించి వేయడం వల్ల ఏమాత్రం మేత వథా కాదు అని వెటర్నరీ డాక్టర్ రాధిక స్పష్టం చేశారు. మండల పరిధిలోని పప్పూరు పశు వైద్యశాలలో బుధవారం పశువిజ్ఞానబడి నిర్వహించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ పాల దిగుబడిని బట్టి పశువులకు దాణా వేయాలని, పశువులకు గడ్డితో పాటు తౌడు, సుబాబుల ఆకులు వేయాలన్నారు. బీరు దాణా, బిస్కెట్ దాణా వల్ల అజీర్తి, అనారోగ్య సమస్యలు వస్తాయని, చూలు నిలువదని, కావున వాటిని ఎక్కువగా వాడకూడదని సూచించారు. పశువులకు బ్రూసెల్లా టీకా వేయించాలన్నారు. అనంతరం పాడి రైతుల సందేహాలను డాక్టర్ నివృత్తి చేశారు.

నేటి నుంచి పశు ఆరోగ్య కార్డుల పంపిణీ

మండల వ్యాప్తంగా నేటి(గురువారం) నుంచి పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ రాధిక తెలిపారు. ఈ కార్డు వల్ల రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి రైతు భద్రంగా ఉంచుకోవాలన్నారున. భవిష్యత్తులో ఈ కార్డు లెక్క ప్రకారమే పశువులకు, గొర్రెలు, మేకలు, తదితర జీవాలకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో విఎ శ్రీనివాసులునాయుడు, గోపాలమిత్రలు, పాడిరైతులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎఎస్ఐకి సన్మానం

పుట్లూరు : స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హనుమంతు తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో బుధవారం ఎస్ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఎఎస్ఐ సేవలను కొనియాడారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

అనంతపురం సిటీ : నూతనంగా నియమించబడిన కెజిబివి స్టాఫ్ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ జె.వరప్రసాద్ పిలుపునిచ్చారు. వడియంపేట సమీపంలోని వైవి.శివారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ ద్వితీయ స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ తెలిపారు. శిక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 214 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని, శిక్షణ సజావుగా నిర్వహిస్తామన్నారు.

సాయి ట్రస్ట్ సభ్యుల మానవత్వం

అనంతపురం : కొంతకాలంగా డోన్ పట్టణ పరిసర ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం సాగిస్తున్న ఉరవకొండ గ్రామీణ ప్రాంతానికి చెందిన వృద్ధుడు మహబూబ్‌బాషాను స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, చంద్ర అనంతపురం నగర శివారులోని బెరాక వృద్ధాశ్రమంలో చేర్పించారు. ముందు వారు వృద్ధుడికి సపర్యలు చేసి డోన్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం, ఆహారం అందించారు. కోలుకున్న వృద్ధుడిని సంరక్షణ నిమిత్తం సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయికుమార్‌ను సంప్రదించగా వృద్ధాశ్రమంలో చేర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు తిమోతి, స్ఫూర్తి మధు, చంద్ర, సాయిట్రస్ట్ నారాయణనాయక్, ఓబుళాపురం క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు మందుల కిట్ పంపిణీ

రాయదుర్గం : 'ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా బుధవారం గుమ్మఘట్ట పిహెచ్‌సి పరిధిలోని పూలకుంట, 75-వీరాపురం గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో క్షయ వ్యాధిగ్రస్తులకు వారి ఇంటి వద్దకు వెళ్లి మందుల కిట్లు పంపిణీ చేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.రమేష్, క్షయ వ్యాధి విభాగం నుంచి ప్రయోగశాల పర్యవేక్షకులు సత్యనారాయణ, చికిత్స పర్యవేక్షకులు శ్రీకాంత్‌నాయక్, ఆరోగ్య సిబ్బంది చాందిని, హేమలత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి

సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిపి పద్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి పద్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు 4 నెలలుగా జరిగిన అభివృద్ధి, మంజూరైన నిధులు, రావాల్సిన నిధుల గురించి తెలిపారు. హౌసింగ్, విద్యుత్ ఎఇలు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ఎంఇఒ మల్లికార్జున, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ జగదీష్, ప్రభుత్వ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వారి వారి శాఖల ప్రగతిని వివరించారు. సింగేపల్లెలో అంగన్వాడీ సెంటర్ కూలిపోయిందని సర్పంచి కృష్ణ సభ దృష్టికి తెచ్చారు. కాగా హెచ్ఎల్‌సి, పోలీస్, ఆర్‌అండ్‌బి, ఆర్టీసీ, ఫారెస్ట్, మైన్స్ అండ్ జియాలజీ శాఖల అధికారులు గైర్హాజరు కావడం పట్ల ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేయగా సదరు అధికారులపై జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని ఇఒపిఆర్‌డి విజయమ్మ సభకు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని బొమ్మనహాల్‌ను కరువు మండలంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసి మెంబర్లు, కోఆప్షన్ సభ్యుడు, వైస్ ఎంపిపి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

అనంతపురం : నగరంలోని జీసస్‌నగర్‌లో ఉన్న ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో బుధవారం నిర్వహించిన హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ క్యాంపస్ డ్రైవ్‌లో 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌కు వివిధ కళాశాలల నుంచి 65 మంది విద్యార్థులు హాజరవగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను సోమశేఖరరెడ్డి అభినందించి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్. వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. టి.శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనాథ్, బోధన, బోధనేతర బృందం, విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులు సమెజ్ గొల్లపల్లి, డాక్టర్ సమీర్ పాల్గన్నారు.

వైసిపి నేతకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

గుత్తి : అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి నాయకునికి వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి బుధవారం రూ. లక్ష అందజేశారు. మండల పరిధిలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు లక్ష్మీనారాయణ అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని మండల, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. మండల కార్యాలయంలో బుధవారం ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో విశ్వ సమీక్ష నిర్వహించారు. విశ్వ మాట్లాడుతూ విడపనకల్లు-1, 2, వేల్పుమడుగు సచివాలయాల పరిధిలో నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, అధికారులు గుర్తించిన సమస్యలు ఏ మేరకు పరిష్కారం అయ్యాయి, తదితర అంశాలపై ఆరా తీశారు. కొన్ని సచివాలయాల పరిధిలో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలసత్వం వీడి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి హనుమంతు, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, ఇఒఆర్‌డి సత్యబాబు, ఉప సర్పంచి ఓబులమ్మ, జెసిఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, నాయకులు కరణం భీమరెడ్డి, కొట్టాలపల్లి సర్పంచ్ రామాంజనేయులు, సెక్రటరీ బాషా, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు కలిగి ఉండాలని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అనంత రాముడు సూచించారు. నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు'పై జాతీయ సేవా పథం, ఉమెన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ గూడూరు సీతామహ లక్ష్మి, విశిష్ట అతిథిగా మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా హేమలత హాజరయ్యారు. సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి చేతనైనంత సహాయం చేయాలని సూచించారు. డా. హేమలత మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను మరచిపోకూడదన్నారు. మనిషి తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు, కావాల్సింది సంకల్పం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రామ్మూర్తి, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్, ఆచార్య డా. మాధవి, నీరజ, జాతీయ సేవా పథం అధికారి ఖలీల్ బాషా, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరులో బుధవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమికి వైసిపి యువనేత, జిల్లా ఖో-ఖో కమిటీ అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పలు సమస్యలను విన్నవించారు. కొనకొండ్ల గ్రామంలో సొంతిల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. బెళుగుప్ప, బొమ్మనహాల్, యల్లనూరు మండలాలను సైతం కరువు ప్రాంతాలుగా ప్రకటించాలన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో వలసలను నివారించడానికి ఉపాధి పని దినాలను పెంచాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో అటవీ భూములు సాగు హక్కు కలిగిన గిరిజనులు/తండావాసులకు బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని విన్నవించారు. స్వచ్ఛభారత్, గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

వడియం పేట వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ప్రజాశక్తి-అనంతపురం

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని వడియం పేట సమీపంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ సిఐ పి.సాయిప్రసాద్, ఎఇఇ ఎల్.రవీంద్ర నాథ్, మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఉదయం 6.30 గంటల సమయంలో వడియంపేట సమీపంలోని పంజాబీ డాబా వద్ద హైవేపై తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 301.5 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సిఎస్‌డిటి పి.రామకృష్ణారెడ్డికి అప్పగించారు. బియ్యం తరలిస్తున్న వై.రత్నకుమార్, డ్రైవర్ జి.రహిమాన్, వాహన యజమాని జి.కరీముల్లాపై కేసు నమోదు చేశారు.

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 60 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని బుధవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కడప జిల్లా సింహాద్రిపు రానికి చెందిన శివకోటిరెడ్డి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'మీరా నీతులు చెప్పేది'

'కాలవ'పై ప్రభుత్వ విప్ 'కాపు' ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి పాలనలో అడ్డూ, అదుపూ లేకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడిన మీరా మాకు నీతులు చెప్పేది అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుపై ధ్వజమెత్తారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో బుధవారం కాపు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలవకు పైత్యం నెత్తికెక్కి, విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దర్గా హొన్నూరులో టిడిపి కార్యకర్త మద్యం మత్తులో బొమ్మనహాల్ వైస్ ఎంపిపి ఇంట్లోకి చొరబడి దౌర్జన్యానికి పాల్పడగా కేసు పెడితే అది అక్రమ కేసు అని కాలవ పేర్కొనడం శోచనీయమన్నారు. చేతనైతే పట్టణం నలువైపులా అక్రమ లేఔట్‌లు, భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న టిడిపి నాయకులపై కలెక్టర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డిఐజికి ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. పట్టణంలో కర్నాటక మద్యం, ఇసుక, మట్టి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌కి పాల్పడుతున్నది టిడిపికి చెందిన వారే అని ఆరోపించారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన పొత్తు తెలంగాణలో జనసేన, బిజెపి పొత్తు టిడిపి, కాంగ్రెస్ పొత్తు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇవి వావి వరసలు లేని రాజకీయ వ్యభిచారం కాదా అన్నారు. టిడిపికి కాలం చెల్లిందని 2024 ఎన్నికల్లో నామరూపాలు లేకుండా పోతుందన్నారు. ఆయనతో పాటు వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల సృష్టికి వైసిపి కుట్ర

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశంలో కాలవ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి ప్రభుత్వం పెద్దఎత్తున దొంగ ఓట్లను సృష్టించడంతో పాటు టిడిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించడానికి కుట్ర చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. పట్టణం లోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి-జనసేన ఉమ్మడి సమావేశం నిర్వహించారు. అనంతరం కాలవ విలేకరులతో మాట్లాడుతూ టిడిపి-జనసేన కలిసి పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడతాయన్నారు. దొంగ ఓట్లను అరికట్టడంతో పాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లాలో కరవు తాండవిస్తోన్నా సహాయక చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వం, అధికారుల బాధ్యతారాహిత్యం అన్నారు. కరువుపై టిడిపి, జనసేన క్షేత్రస్థాయిలో పర్యటించి రాజీలేని పోరాటం చేస్తామని, రైతులు, బాధితులకు బాసటగా నిలుస్తామన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు కింద పంటలు పండేంత వరకూ సాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఎమ్మెల్యే కాపు అవినీతి, అక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తామని టిడిపి-జనసేన తెలిపాయి. ఉమ్మడి అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నామని కాలవ తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరేగౌడ్ర మంజునాథ్‌గౌడ్, ఇరు పార్టీల మండల, పట్టణ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

రేపు బిసిల సమావేశం : కాలవ

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో బిసిల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి బిసిలందరూ హాజరై జయప్రదం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం కాలవ విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివద్ధి నాలుగున్నరేళ్లుగా పూర్తిగా కుంటుపడిందన్నారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించేందుకు ఈ నెల 17న తాడిపత్రి రోడ్డులోని షిరిడిసాయి కళ్యాణమండపంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసిపి పాలనలో బీసీలకు తీరని అన్యాయం జరిగిం దన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌ల కుదింపు, బీసీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిపోయింద న్నారు. జగన్ ప్రభుత్వ చర్యలు బీసీల అభ్యున్నతికి గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. బిసిలకు వైసీపీ ప్రభుత్వ చేసిన నమ్మక ద్రోహంపై ఐక్య పోరాటంలో భాగంగా కుల సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కావున వెనుకబడిన వర్గాల ప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయవంతం చేయాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

సాహిత్య పఠనంతో బాలల సమగ్ర వికాసం

అనంతపురం : బాల సాహిత్య పఠనంతో పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. 'నేటి తెలుగు బాలసాహిత్య విస్తరణ' అంశంపై బుధవారం నగరంలో 'రాజ్యమహిళా సమ్మాన్' అవార్డు గ్రహీత, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి అధ్యక్షతన అంతర్జాల సదస్సు(వెబినార్) ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రఖ్యాత గజల్ గాయకులు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, చొక్కాపు వెంకటరమణ, విశిష్ట అతిథులుగా దాసరి వెంకటరమణ, డా. పత్తిపాక మోహన్, డికె.చదువులబాబు హాజరై ప్రసంగించారు.సాంకేతిక యుగంలో బాల సాహిత్య విస్తృతికి సామాజిక మాధ్యమాలు ఎంతగానో దోహదపడుతు న్నాయన్నారు. బాలసాహిత్యాన్ని మొదటితరం రచయితలు తరవాతి తరానికి అందించారని వివరించారు. 'నేటి తెలుగు బాలసాహిత్య విస్తరణ' అంశంపై ప్రముఖ బాలసాహితీవేత్త, బాలసాహిత్య పరిషత్ కోశాధికారి పైడిమర్రి రామకృష్ణ కీలకోపన్యాసం చేశారు. సదస్సుకు గౌరవ అతిథులుగా నారంశెట్టి ఉమామహేశ్వర రావు, డా. కందేపి రాణీప్రసాద్, తిరునగరి వేదాంతసూరి హాజరై మాట్లాడారు. ఆత్మీయ అతిథులుగా డా. పతికి రమేష్ నారాయణ, చొప్ప వీరభద్రప్ప, ప్రత్యేక అతిథులుగా సురేంద్ర, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సలహాదారు గొర్తి వెంకటస్వామి, సాకే శ్రీహరిమూర్తి, సాకేనరేష్ హాజరయ్యారు. వెబినార్ సమన్వయకర్తగా డా. బత్తల అశోక్ కుమార్ వ్యవహరించారు. బాలల హక్కులు-చట్టాలు-సామాజిక బాధ్యత' అంశంపై ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంతర్జాల సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ సిఇఒ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు తెలిపారు.